# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. సరికొత్త ఆవిష్కరణలతో వికసిత్ భారత్ దిశగా దేశం పురోగమిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.
2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర సచివాలయంలో గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ వంటి పలు శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నారు.
3. గ్రామీణ జీవనోపాధి అభివృద్ధికి స్వయం సహాయక సంఘాల్ని అనుసంధానం చేయనున్నట్లు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు.
4. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సమగ్ర శిక్షా ప్రాజెక్టు సంచాలకులు బి.శ్రీనివాసరావు తెలిపారు.
5. రావిశాస్త్రిగా ప్రసిద్ధుడైన రాచకొండ విశ్వనాథశాస్త్రి జయంతి ఈరోజు.

==========================

సరికొత్త ఆవిష్కరణలతో వికసిత్ భారత్ దిశగా దేశం పురోగమిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఈరోజు ఢిల్లీలో నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ –సిఐఐ సదస్సులో "వికసిత భారత్ వైపు ప్రయాణం" అనే అంశంపై ఆయన ప్రసంగించారు. భారత్ అభివృద్ధి చెందేందుకు పరిశ్రమలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనూ పరిశ్రమల అభివృద్ధికి తగిన కేటాయింపులు చేశామని పేర్కొంటూ...

..వాయిస్.. 35 సెకన్లు

--------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖపై సమీక్ష నిర్వహిస్తున్నారు. మన్యంలో మెరుగైన వసతుల కల్పన, కొండ ప్రాంతాల్లో గిరిజనుల సౌకర్యాలపై చర్చించనున్నారు. రాష్ట్రంలో వసతిగృహాల నిర్వహణ, అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు చేయకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. సాయంత్రం వరకు ఈ విభాగాలలో పలు అంశాలపై అధికారులకు.. ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

--------------------------

గ్రామీణ జీవనోపాధి అభివృద్ధికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో స్వయం సహాయక సంఘాల్ని అనుసంధానం చేయనున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడించారు. విజయవాడలోని సెర్ప్ కార్యాలయంలో నిన్న మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం సహాయక మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ ఆర్థికంగా మరింత అభివృద్ధి చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులని మంత్రి ఆదేశించారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన ఆరోగ్య, పోషకాహారం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని సమగ్ర శిక్షా ప్రాజెక్టు సంచాలకులు బి.శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రమాణాల సంస్థ–బీఐఎస్ ఆధ్వర్యంలో నిన్న విజయవాడలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం నిర్వహణపై ఉపాధ్యాయులు, ఆహార విక్రయదారులకు బీఐఎస్ అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆహారాన్ని తయారు చేయడంలో 80 వేల మందికి రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ ఇవ్వడానికి బీఐఎస్ ప్రమాణాలను ఉపయోగిస్తామని తెలిపారు.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన ఆగస్టు 2న రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జరగనుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉదయం 11 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది. ఈ క్రమంలో మంత్రిమండలో చర్చించాల్సిన అంశాల్ని, ప్రతిపాదనల్ని నిర్దేశిత విధానంలో రేపు సాయంత్రం లోపల సాధారణ పరిపాలన శాఖకు అందజేయాలని అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. అలాగే ముఖ్యమంత్రి అధ్యక్షతన సచివాలయంలో ఆగస్టు 5న కలెక్టర్ల సమావేశం జరగనుందని, మంత్రులు, ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల కలెక్టర్లు దీనికి హాజరుకానున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో చుక్కల భూముల నమోదులో అవకతవకలు జరిగినట్లు గుర్తించామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా తెలిపారు. అమరావతిలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటన ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు గుర్తించామని తెలిపారు. చుక్కల భూముల్లో 14వేల ఎకరాలు ప్రైవేటు వ్యక్తుల పేరుతో రిజిస్ట్రేషన్ చేసినట్లు విచారణలో తెలిసిందన్నారు. ఇప్పటికే రెవెన్యూ దస్త్రాల దహనం కేసులో కొందరు అధికారులను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతి ప్రాంతం నుంచి దేశంలోని అన్ని ప్రాంతాలకు విమాన సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు సమావేశాల్లో భాగంగా నిన్న ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధిపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విమానాశ్రయం నుంచి దేశంలోని వారణాసి, కొలకత్తా, కొచ్చిన్, అహ్మదాబాద్, పూణెలకు విమానయాన సౌకర్యాలు

పెంచాలని కోరామని, ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

---------------------------

రావిశాస్త్రిగా ప్రసిద్ధుడైన రాచకొండ విశ్వనాధశాస్త్రి జయంతి ఈరోజు. 1922 జూలై 30వ తేదీన శ్రీకాకుళంలో పుట్టిన ఆయన వృత్తి రీత్యా న్యాయవాది. సామాన్య ప్రజల జీవితాలే ప్రధాన కథా వస్తువులుగా ఆయన రచనలు చేశారు. తెలుగు కథా సాహిత్యంలో ఆయన రచించిన "ఆరు సారా కథలు", "అల్పజీవి" "రత్తాలు–రాంబాబులు" వంటి రచనలు ప్రసిద్ధి పొందాయి.. ఆ మహనీయుడు, 1993, నవంబర్ 10వ తేదీన తుదిశ్వాస విడిచారు.

---------------------------

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని తిరుపతి జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్ తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని ఆర్.పి.బి.ఎస్.ప్రభుత్వ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించి విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వి.శేఖర్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుతో ప్రభుత్వ పాఠశాలలలో, విద్యార్థుల చేత మొక్కలు నాటిస్తున్నామని తెలుపుతూ,

..వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ నిర్ధారణకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 15నుంచి సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల పరీక్షలను చేపట్టడానికి సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో నిన్న ఎన్సీడీ సీడీ విభాగంపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ, 21 ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో కీమో థెరపీని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. టెలీమానస్ సేవలు పొందడానికి ప్రజలు 14416, 18008914416 టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

---------------------------

పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో ఈ రోజు భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పాల్గొననున్నారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ షూటింగ్‌లో భారత షూటర్లు మను భాకర్, సరబ్జోత్ సింగ్ కాంస్య పతకం కోసం దక్షిణ కొరియా క్రీడాకారులతో పోటీ పడనున్నారు. హాకీలో భారత్ జట్టు ఐర్లాండ్ జట్టుతో బరిలోకి దిగనుంది. అలాగే విలువిద్య, బాక్సింగ్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీ పడనున్నారు.

---------------------------

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతి ఒక్కరూ ఇంటిపై కప్పుపై సౌర ఫలకాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి సూచించారు. నిన్న ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో సూర్య ఘర్ పథకానికి సంబందించిన గోడ, కరపత్రాలను ఆమె విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరూ సౌర విద్యుత్తు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటోందన్నారు. సౌర ఫలకాల ఏర్పాటుకు 78 వేల రూపాయల వరకు కేంద్ర ప్రభుత్వం రాయితీ అందజేస్తుందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

---------------------------

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం ఒక బాధ్యతగా నిర్వహించాలని చిత్తూరు జిల్లా విద్యాశాఖాధికారి సి.దేవరాజు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని పాత పలమనేరలోని స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏక్ పేడ్ మా కే నామ్ అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని ఈరోజు ప్రారంభించి విద్యార్థులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని 2,349 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.

---------------------------

సచివాలయం కార్యాలయ ఉద్యోగులకు ఇంటి అద్దె భత్యం - హెచ్ఆర్ఏను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెంచింది. ప్రస్తుతం ఉన్న 16 శాతం హెచ్ఆర్ఏను 24శాతానికి పెంచుతూ నిర్ణయం ఉత్తర్వులు జారీ చేసింది. 25 వేలకు మించకుండా ఈ భత్యాన్ని వర్తింపజేయాలని నిర్ణయించింది.

======================